సాక్షి
నిజామాబాద్
బుధవారం । 17 । మే । 2023



నందనవనం..
నందిపేట పోలీస్ స్టేషన్ పచ్చదనంతో కళకళలాడుతూ.. ఠాణాకు వచ్చే వారికి ఆహ్లాదాన్ని పంచుతోంది.
- 8లో ▸



ఆవులను ఎత్తుకెళ్తున్నారు
మున్సిపల్ అధికారులు డ్రై రిసోర్స్ సెంటర్‌కు తరలించిన ఆవులను ఎత్తుకెళ్లడానికి కొందరు యువకులు యత్నించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.3 /28.0
ఉదయం నుంచే ఎండ ప్రతాపం అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేషన్ డీలర్ల సమ్మె నోటీసు



సుభాష్‌నగర్: పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జూన్ 5 నుంచి సమ్మెకు దిగుతున్నామని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగకిషన్, నగేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని, సరుకుల దిగుమతి, హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణం నిర్వహణ కోసం సుమారు 40 గజాల స్థలం, ప్రభుత్వ నిధులతో గదిని నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్థసారథి, ఖమర్‌ఖాన్, రఘు, రవి, కిరణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పాలిసెట్
నిజామాబాద్‌అర్బన్: నగరంలో బుధవారం నిర్వహించే పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్ష కన్వీనర్ శ్రీరాంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో 16 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 5,849 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలని సూచించారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



ఖలీల్‌వాడి: చిన్నారులు తమకు ఎదురయ్యే ఇబ్బందులు, బాధల గురించి ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటారని, అందుకే రాజ్యాంగంలో బాలలకు ప్రత్యేకంగా హక్కులు కల్పించారని రాష్ట బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు దేవయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాలతో కలిసి బాలల హక్కుల పరిరక్షణ, వారి కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్య, వైద్య సేవల గురించి చర్చించారు. బాల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ పూర్తి స్థాయిలో జరిగేలా పకడ్బందీగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న బాలలకు మంచి విద్య అందేలా చూడాలన్నారు. బాలల సంరక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు సహకారం అందించాలన్నారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కమిటీలు ఏర్పాటు చేసి బాలల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రసూల్ బీ, సుధారాణి, బాలల సంరక్షణ అధికారి చైతన్య కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ఏర్పాటు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రతి వార్డులో చెత్త సేకరణకు సంబంధించి ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీ తెలిపారు. మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నగరంలో ప్రతి వార్డులో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్‌కి సంబంధించిన కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వాటి గురించి ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద స్వయం సహాయక సంఘాలకు చెందిన 10 మంది సభ్యులు ఉండాలని, ఈ నెల 20 నుంచి జూన్ 5 వరకు పొడి చెత్తకు సంబంధించిన అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు, వినియోగించిన దుస్తులు, షాంపూ కవర్ల నుంచి పుస్తకం వరకు ఆర్‌ఆర్‌ఆర్ తీసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, సునీల్, నటరాజ్ గౌడ్, ప్రభుదాస్, శ్రీకాంత్, మహిపాల్, సోలోమాన్ పాల్గొన్నారు.

వివాదం.. సశేషం!

- తెలంగాణ వర్సిటీ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం
- గల్లీ రాజకీయాలను తలపిస్తున్న తెయూ వ్యవహారాలు
- పాలకమండలి, నవీన్ మిట్టల్ వర్సెస్ వైస్ చాన్స్‌లర్
- బడ్జెట్ ఆమోదం లేదు.. ఈసీ తీర్మానాల అమలు ఊసే లేదు
- అక్రమాలపై గవర్నర్‌ను కలిసిన బీజేపీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ వర్సిటీలో ఆదిలోనే సమస్య పరిష్కరిస్తే చిక్కుముడులు రాకుండా ఉండేవి. ఈ విషయంలో పకడ్బందీగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ గడపడంతో గత 20 నెలల్లో సమస్య మరింత ముదిరి పోయింది. దీంతో వర్సిటీలో వ్యవహారాలు చిల్లర రాజకీయాలను తలపిస్తున్నాయి. చివరకు వైస్ చాన్స్‌లర్ వర్సెస్ పాలకమండలి సభ్యులు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మధ్య వ్యక్తిగత విమర్శల వరకు వెళ్లింది. వీసీ ప్రెస్‌మీట్ పెట్టి నవీన్ మిట్టల్‌పై తీవ్రమైన విమర్శలు, ఆరోపణలు చేశారు. 2021 అక్టోబర్ 30న యాదగిరిని రిజిస్ట్రార్‌గా పాలకమండలి నియమించినప్పటికీ, వీసీ తొలగించి మధ్యలో ముగ్గురు రిజిస్ట్రార్లను మార్చుకుంటూ వచ్చారు. చివరకు గత మూడు ఈసీ సమావేశాలకు వీసీ హాజరు కాలేదు. గత నెల 19న జరిగిన ఈసీ సమావేశం నుంచి వీసీ వాకౌట్ చేశారు. ఈ క్రమంలో నవీన్‌మిట్టల్, వీసీ రవీందర్ మధ్య తీవ్ర పదజాలంతో విమర్శలు చోటుచేసుకున్నాయి. చివరకు పాలకమండలి నిర్ణయాలు సైతం అమలు కాకుండా వీసీ అడ్డుకుంటుండడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోకుండా మీనమేషాలు లెక్కించడమేమిటని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విశేషం. తమ ఓటు బ్యాంకుకు వర్సిటీ వ్యవహారాలు ముడిపడి లేనందునే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారని విమర్శలు వస్తున్నాయి.

గత నెల 19న జరిగిన ఈసీ సమావేశంలోని తీర్మానాలు అమలు కాకుండా వీసీ హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చారు. గత నెల 26న, ఈ నెల 5న, 12న జరిగిన సమావేశాలకు వీసీ హాజరు కాలేదు. ఈ మూడు సమావేశాలకు నవీన్ మిట్టల్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశాల్లో చేసిన తీర్మానాలను సైతం ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి అమలు చేయించలేని పరిస్థితి. నలుగురు ప్రొఫెసర్ల సర్వీసు పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి టాంపరింగ్ చేసిన కనకయ్యపై క్రిమినల్ కేసు పెట్టాలనే తీర్మానం, విద్యావర్ధినిని సస్పెండ్ చేసే తీర్మానం, వీసీ అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, నిజామాబాద్ సీపీతో విచారణ చేయించే తీర్మానాలు అమలుకు నోచుకోవడం లేదు.

రిజిస్ట్రార్ చాంబర్‌కు రాని ప్రొఫెసర్ యాదగిరి
తెయూ (డిచ్‌పల్లి) : తెలంగాణ వర్సిటీలో రెండో రోజు మంగళవారం కూడా రిజిస్ట్రార్ చాంబర్‌కు రాకుండా ప్రొఫెసర్ యాదగిరి డీన్ కార్యాలయానికే పరిమితమయ్యారు. వీసీ రవీందర్‌గుప్తా ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేసి ఉంచిన విషయం తెలిసిందే. తెయూ పాలకమండలి (ఈసీ) రిజల్యూషన్ ద్వారా రిజిస్ట్రార్‌గా నియామకమైన ప్రొఫెసర్ ఎం యాదగిరి కి ఎలాంటి ఉత్తర్వులు లేవని ఆయనను రిజిస్ట్రార్‌గా గుర్తించేది లేదని వీసీ తెగేసి చెబుతున్నారు. వీసీ రవీందర్‌గుప్తా వర్సిటీకి రానప్పటికీ, రెండోరోజు సైతం రిజిస్ట్రార్ చాంబర్‌కు రాని విషయమై యాదగిరిని సంప్రదించగా జరిగిన ఘటలను తాను ఎప్పటికప్పుడు ఈసీ మెంబర్లకు, ప్రభుత్వానికి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకున్న తర్వాతే తాను తిరిగి రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చుంటానని స్పష్టం చేశారు. పూటకో మాట మాట్లాడుతున్న వీసీ రవీందర్ గుప్తా చేష్టల వల్ల తెయూ ప్రతిష్ఠ రాష్ట్రవ్యాప్తంగా నవ్వుల పాలవుతుందని వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు యూనివర్సిటీకి రిజిస్ట్రార్ ఎవరనేది ఎవరికీ అర్థం కాకుండా పోయింది.



తెరిచి ఉన్న తెయూ రిజిస్ట్రార్ కార్యాలయం


కామర్స్ డీన్ కార్యాలయంలోనే పని చేసుకుంటున్న రిజిస్ట్రార్ యాదగిరి

'సేవ్ తెలంగాణ వర్సిటీ'
నిరాహారదీక్షకు ఏర్పాట్లు
తెయూలో నెలకొన్న అక్రమాలు, అవకతవకలు తదితర వ్యవహారాలపై ప్రభుత్వం పట్టించుకోకపోతుండడంతో వివిధ విద్యార్థి సంఘాలు 'సేవ్ తెలంగాణ యూనివర్సిటీ' పేరిట నిరాహారదీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ గందరగోళ వ్యవహారాలపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కులాచారి దినేష్‌కుమార్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కారణంగానే ప్రస్తుత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని వీసీ రవీందర్ చెప్పిన విషయాన్ని పేర్కొన్నారు. వీసీ దొంగ అని నవీన్‌మిట్టల్, నవీన్ మిట్టల్ దొంగ అని వీసీ అంటున్నారని పేర్కొన్నారు. వీసీ అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

అఖిలపక్ష సమావేశం..



'సేవ్ తెలంగాణ యూనివర్సిటీ' పేరుతో ఉద్యమానికి రంగం సిద్ధం చేస్తున్నాం. ఇందులో భాగంగా బుధవారం అఖిలపక్ష విద్యార్థి సంఘాలతో సమావేశం నిర్వహించనున్నాం. వర్సిటీ వ్యవహారాలపై చర్చించి ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతూ నిరాహారదీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పాలకమండలి తీర్మానాల మేరకు అక్రమాలపై పూర్తి విచారణ చేయించి నిజాలు బయటపెట్టాలి. నిబంధనల మేరకు ఉద్యోగాలు ఇచ్చి, వర్సిటీలో విద్యాభివృద్ధి మెరుగుపరచాలి. వరుసగా రిజిస్ట్రార్ల మార్పుతో యూనివర్సిటీ పరువును బజారుపాలు చేశారు. మరోవైపు వీసీ మాత్రం తాను రూ.3 కోట్లు ఇచ్చి పదవిలోకి వచ్చినట్లు పలుచోట్ల వ్యాఖ్యలు చేయడం గమనార్హం.
– వేణురాజ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

నేడు టీచింగ్ స్టాఫ్‌తో వీసీ సమావేశం

- ఏవో పేరిట సర్క్యులర్ జారీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని మూడు క్యాంపస్‌లకు సంబంధించిన బోధనా సిబ్బంది (టీచింగ్ స్టాఫ్)తో బుధవారం వీసీ రవీందర్‌గుప్తా ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వీసీ ఆదేశాల మేరకు అడమిక్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) పేరిట మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. వీసీ సూచన మేరకు ఈ సర్క్యులర్ ను తెయూ మెయిన్ క్యాంపస్ డిచ్‌పల్లి, సౌత్ క్యాంపస్ భిక్కనూర్, ఎడ్యుకేషన్ క్యాంపస్ సారంగపూర్‌కు సంబంధించి అన్ని విభాగాల అధ్యాపకులకు ప్రిన్సిపాల్ ఆరతి పంపించారు. మెయిన్ క్యాంపస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఉంటుందని సర్క్యులర్ లో పేర్కొన్నారు. వీసీ రవీందర్‌గుప్తా మీడియాతో మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరం తరగతులు ఈ నెల 18 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. అందుకే ఈ నెల 30 వరకు ఉన్న వేసవి సెలవును రద్దు చేసి తరగతులు ప్రారంభించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగానే బుధవారం అన్ని విభాగాల అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెలాఖారు వరకు సెలవులు ప్రకటించడంతో పలువురు అధ్యాపకులు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ఎండలు మండిపోతుంటే తరగతులు ప్రారంభించాలని నిర్ణయించడం సమంజసం కాదని అధ్యాపకులు విమర్శిస్తున్నారు. ఓయూలో కూడా జూన్ మొదటి వారం వరకు సె లవులు ప్రకటించారని వారు గుర్తు చేశారు. తరగతులు ప్రారంభించినా విద్యార్థులు హాజరయ్యే అవకాశాలు తక్కువ అని అంటున్నారు. రిజిస్ట్రార్ పేరిట జారీ చేయాల్సి సర్క్యులర్‌ను రిటైర్డ్ కాంట్రాక్టు ఉద్యోగి పేరుతో జారీ చేయడం ఏంటని అధ్యాపకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం

సుభాష్‌నగర్: వానాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో నకిలీ విత్తనాలు చెలామణి కాకుండా ఉక్కుపాదంతో అణిచివేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. డీజీపీ అంజనీకుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు తదితరులతో కలిసి మంత్రి నిరంజన్ రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షించారు. వానాకాలం సాగుకు సంబంధించి ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కడా నకిలీ విత్తనాలు అనే పదం వినిపించకూడదని, ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నందున ఎంతో అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఆంధ్ర, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి నకిలీ సీడ్ మన రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నకిలీ విత్తనాల తయారీదారులు, వాటి విక్రేతలను గుర్తిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ నిర్వహణ వంటి చిన్న చిన్న లోపాలను గుర్తించిన సమయాల్లో వాటిని సవరించుకోవాల్సిందిగా డీలర్లకు సూచించాలన్నారు. ఆ మేరకు వారిలో మార్పు రాని పక్షంలో నిబంధనలను అనుసరిస్తూ చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ శాఖ అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందాలు సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగిస్తూ, విరివిగా తనిఖీలు నిర్వహించాలని డీజీపీ అంజనీకుమార్ సూచించారు. నకిలీ విత్తనాల దందాను నిర్వహించే వారిని గుర్తిస్తూ, అవసరమైతే పీడీ యాక్టు పెట్టాలని ఆదేశించారు. నకిలీ విత్తనాల కేసులతో సంబంధం కలిగి ఉన్న పాత నేరస్తులను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి నర్సింగ్ దాస్, ఏసీపీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

తరాల తాటి వనాలు

- డొంకేశ్వర్ మండలంలో వేలాదిగా చెట్లు
- ఏ గ్రామంలో చూసినా గుంపులుగా ఆకట్టుకుంటున్న తాళ్లు
- గీత కార్మికులకు జీవనాధారం

డొంకేశ్వర్(ఆర్మూర్): వందల ఎకరాల్లో గుంపులు గుంపులుగా పెరిగిన తాటి చెట్లు డొంకేశ్వర్ మండలంలో కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ ఏ గ్రామంలో చూసినా పచ్చని పొలాల నడుమ ఎత్తయిన తాటి వనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ చెట్లే ఆయా గ్రామాల్లోని గీత కార్మికులకు జీవనాధారంగా మారాయి. తరతరాలుగా ఇవే చెట్లను గీస్తూ వస్తున్నారు. వీటి ద్వారా లభిస్తున్న ఉపాధితో వందల కుటుంబాలు బతుకుతున్నాయి. తాటికల్లును తాగేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా వస్తున్నారు. పల్లెల్లోని ప్రకృతిని చూసి పరవశిస్తున్నారు.

పొలాలు, నదీ తీరాల్లో...
మండల పరిధి గ్రామాల్లో లెక్కపెట్టలేనన్ని తాటి చెట్లు ఉన్నాయి. ఖాళీ స్థలాలు, పొలాలు, నదీ తీరాల్లో వేలాది సంఖ్యలో ఎటు చూసినా ఇవే దర్శనమిస్తాయి. డొంకేశ్వర్‌తో పాటు అన్నారం, సిర్పూర్, నడ్కుడ, గాదెపల్లి, దత్తాపూర్, నికాల్‌పూర్, నూత్‌పల్లి ప్రాంతాల్లో తాటి చెట్లు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి. ఈ ఎనిమిది గ్రామాలు కలిపి గీత కార్మిక కుటుంబాలు 200పైగా ఉన్నాయి. ఇందులో 60 శాతం మంది తాటి చెట్లు గీసేవారున్నారు. చాల ఏళ్లుగా తాటిచెట్లకు కల్లు గీస్తూ వస్తున్నారు. కొన్ని చెట్లకైతే వందేళ్ల వయసున్నా, ఇప్పటికీ కల్లు రావడం గొప్ప విషయమని చెప్పవచ్చు. ఒకే చెట్టుకు తాతలు, తండ్రులు కల్లు గీయగా, ప్రస్తుతం వారి కొడుకులు గీయడం గమనార్హం. ఇదే వృత్తిపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు.

మాకు దైవ సమానం



తాతల కాలం నుంచి మా కుటుంబమంతా ఇదే వృత్తిని కొనసాగిస్తున్నాం. తాటిచెట్లే మాకు జీవనాధారం. ఇంట్లో కంటే ఎక్కువగా తాటి వనాల్లోనే గడుపుతాం. తాటి చెట్లను అన్నం పెట్టే దేవుళ్ల లాగా భావిస్తున్నాం. మండల పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల్లో కూడా తాటిచెట్లు ఎక్కువగా ఉంటాయి.
– అనిల్‌గౌడ్, డొంకేశ్వర్

భరోసా లేని జీవితాలు
తాటిచెట్లు చూడ్డానికి అందంగానే కనిస్తాయి. కానీ 50 అడుగుల ఎత్తులో ఉండే ఈ చెట్లను గీత కార్మికులు ఎక్కడమంటే అతిశయోక్తి కాదు. చెట్టు ఎక్కి కల్లు తీసి కిందికి దిగే వరకు భరోసా లేదు. ప్రమాదవశాత్తు పట్టుతప్పి పడిపోతే ఆదుకునేవారు లేరు. ముఖ్యంగా డొంకేశ్వర్‌తో పాటు ఆయా గ్రామాల్లో తాటిచెట్లు ఎక్కే వారెవరికీ బీమా సౌకర్యం లేదు. సొసైటీ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి పథకాలను పొందలేకపోతున్నారు.

ప్రభుత్వం గుర్తించాలి



తాటిచెట్లు ఎక్కి కల్లు గీయాలంటే ప్రమాదంతో కూడుకున్న పని. మాది ఇదే వృత్తి కాబట్టి అలవోకగా చెట్లను ఎక్కుతాం. కానీ పట్టుతప్పి పడిపోతే ప్రాణాలకే ప్రమాదం. మా కుటుంబాలు మేము చేసే పనితోనే ఆధారపడ్డాయి. ఏదైనా జరిగితే ప్రమాద బీమా కూడా లేదు. ప్రభుత్వం గుర్తించి బీమా కల్పించాలి.
– మహేందర్‌గౌడ్, డొంకేశ్వర్


డొంకేశ్వర్‌లో తాటిచెట్లు


తాటి చెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు

వానాకాలం సాగుకు సన్నద్ధం


నాగంపేట్‌లో పంట భూమిలో ఎరువులు చల్లుతున్న రైతులు

- ఎరువులను చల్లుకుంటున్న రైతులు
- మరో పది రోజుల్లో రోహిణి కార్తె

బాల్కొండ: ఓ వైపు యాసంగిలో సాగు చేసిన పంటల కథ ఒడవక ముందే అన్నదాతలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. మరో పది రోజుల్లో రోహిణి కార్తె వస్తుంది. రోహిణి కార్తెలోనే రైతులు పంటలు విత్తడం ప్రారంభిస్తారు. అందుకోసం కావాల్సిన ఏర్పాట్లను ప్రారంభించారు. పంట భూముల్లో లోతు దుక్కులు, రొటవేటర్ చేపించిన రైతులు ప్రస్తుతం సేంద్రియ ఎరువులను చల్లడంలో నిమగ్నమయ్యారు. యాసంగిలో సాగు చేసిన సజ్జ పంట కోతలు ఇంకా పూర్తి కాలేదు. సజ్జ పంట సాగు చేసిన నేలల్లో సోయా, మక్క వేస్తారు. జొన్న పంట సాగు చేసిన నేలల్లో పసుపు సాగు చేస్తారు. జొన్న కోతలు ఫిబ్రవరిలోనే అయిపోయాయి. అప్పటి నుంచి నేలను సిద్ధం చేయడంలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం పసుపు సాగు చేసే నేలల్లో సేంద్రియ ఎరువులను వేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి గత నెల వరకు కాలువల ద్వారా నీటి విడుదల కావడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. దీంతో బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల రైతులు ముందస్తుగానే పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సేంద్రియ ఎరువులను చల్లిన తర్వాత నేలను దుక్కి దున్ని సిద్ధంగా ఉంచుతారు. పసుపు పంటను జూన్ మొదటి వారంలో విత్తడానికి రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వానాకాలం పంటల సాగు ప్రణాళికను వ్యవసాయ అధికారులు ఇదివరకే సిద్ధం చేశారు.

తొర్తిలో మొసలి కలకలం
మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తి నల్లచెరువులో మొసలి ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన గంగపుత్రులకు మొసలి కనిపించడం కలకలం సృష్టించింది. వర్షాకాలంలో పెద్దవాగు ఉప్పొంగడంతో ఆ నీటి ద్వారా మొసలి చెరువులోకి చేరి ఉంటుందని గంగపుత్రులు సందేహిస్తున్నారు. మొసలిని పట్టుకోవాలంటే చెరువులో నీటిని ఖాళీ చేయాలని లేకుంటే కష్టం అని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. చెరువులో మొసలి కనిపించిన నుంచి చేపలు పట్టడం నిలిపివేశారు. పశువులను కూడా చెరువు వైపు పంపించడం లేదు. మొసలిని పట్టుకోవడానికి చెరువు నీటిని ఖాళీ చేయాలని స్థానిక గంగపుత్రులు తహసీల్దార్ జనార్దన్‌కు మంగళవారం వినతి పత్రం అందచేశారు.


తొర్తి చెరువులో సంచరిస్తున్న మొసలి

క్లుప్తంగా

అసత్యాలు ప్రచారం చేయడం తగదు



వేల్పూర్‌: మండలంలోని రామన్నపేట్‌ గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు తమపై అసత్యాలు ప్రచారం చేయడం తగదని గ్రామానికి చెందిన 24 సంఘాల వారు పేర్కొన్నారు. ఈమేరకు వారు మంగళవారం మీడియాతో మాట్లాడారు. పెద్దమ్మ ఆలయ భూమి విషయంలో వారికి, గ్రామస్తులకు మధ్య విబేధాలు ఏర్పడగా, వారికివారే గ్రామస్తులకు దూరంగా ఉంటూ సాంఘిక బహిష్కరణ విధించినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. సమస్య పరిష్కారమే తాము కోరుకుంటున్నామని, గొడవలు ఇష్టం లేదన్నారు. చర్చల ద్వారా సమస్య తప్పకుండా పరిష్కారం అవుతుందని, చర్చలకు రావాలని సూచించారు. సమావేశంలో సొసైటి చైర్మన్‌ మోహన్‌రెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, శోభన్‌రెడ్డి, కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ టీపీలో పలువురి చేరిక



వేల్పూర్‌: మండలంలోని అంక్సాపూర్‌ గ్రామానికి చెందిన పలువురు మహిళలు బాల్కొండ నియోజకవర్గ వైఎస్సార్‌ టీపీ కోఆర్డినేటర్‌ పిప్పెర లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌ టీపీలో చేర్చుకున్నారు. ఈసందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో బాల్కొండ నియోజకవర్గంలో పేదవారు సొంత ఇల్లు నిర్మించుకునే భాగ్యం దక్కడం లేన్నారు. బీఆర్‌ఎస్‌ పరిపాలనపై విరక్తి చెంది మహిళలు వైఎస్సార్‌ టీపీలో చేరుతున్నారని చెప్పారు. వచ్చేది రాజన్న రాజ్యమేనని పేర్కొన్నారు.

వాటర్‌ ట్యాంకర్‌ బోల్తా



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం వాటర్‌ ట్యాంకర్‌ అదుపుతప్పి బోల్తాపడింది. ఓ ప్రైవేట్‌ వాటర్‌ ట్యాంకర్‌ను ట్రాక్టర్‌ సహాయంతో తరలిస్తుండగా అదుపుతప్పి బొల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఆక్రమణల తొలగింపు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని హైమాద్‌ బజార్‌లో కొత్తగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మార్కెట్‌ భవన సముదాయం చుట్టూ ఉన్న ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. ఈ ప్రాంతంలో చికెన్‌ దుకాణాలు పదుల సంఖ్యలో ఉండేవి. అధికారులు ఎట్టకేలకు స్పందించడంతో ఆక్రమణలను తొలగించారు. మార్కెట్‌ భవనం చుట్టూ డ్రెయినేజీ నిర్మాణం కోసం పనులు చేపట్టారు.

ఆవులను ఎత్తుకెళ్తున్నారు!

- రోడ్లపై తిరిగే పశువులను డీఆర్‌సీకి తరలించిన కార్పొరేషన్‌ అధికారులు
- సిబ్బందిపై దాడి చేసి, ఆవులను తీసుకెళ్లేందుకు పలువురి యత్నం
- పోలీసుల రాకతో పరుగులు





నగరంలోని డీఆర్‌సీ సెంటర్‌ వద్ద సిబ్బందితో వాగ్వాదానికి దిగిన యువకులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని రహదారులపై పశువుల సంచారంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో కార్పొరేషన్‌ అధికారులు స్పందించి రోడ్లపై తిరిగే పశువులు, ఆవులను ఇటీవల డీఆర్‌సీ(డ్రై రిసోర్స్‌ సెంటర్‌)కు తరలించారు. ఈవిషయం తెలిసిన పలువురు యువకులు సోమవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌సీలో సిబ్బందిపై దాడి చేసి ఆవులను తీసుకెళ్లడానికి ప్రయత్నించగా, ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ అయ్యింది.

ఆవులకు రక్షణ కరువు..

నిజామాబాద్‌ నగర పరిధిలో ఆవులకు రక్షణ లేకుండా పోయింది. ఏళ్ల తరబడిగా ఆవులు రోడ్డుపైనే తిరుగుతూ.. ప్లాస్టిక్‌ ఇతరత్రా వ్యర్థాలు తింటు సంచరిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారులైన కంఠేశ్వర్‌, బస్టాండ్‌, రైల్వేస్టేషన్‌, గాంధీచౌక్‌, పూలాంగ్‌, వర్నిరోడ్‌, బోధన్‌రోడ్‌, వినాయక్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో ఆవులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఆవులను పెంచడానికి ఎవరూ ముందుకు రారు. కానీ రోడ్ల మీద తిరుగుతూ ఉండే ఆవులను ఎత్తుకెళ్లడానికి కొంతమంది యత్నిస్తున్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఆవులకు మత్తుమందు ఇచ్చి, అపహరించేందుకు యత్నించారు. ఈ ఘటన నగరంలో చర్చనీయాంశంగా మారింది.

కార్పొరేషన్‌ ప్రత్యేక కార్యాచరణ..

చాలా సార్లు రోడ్లపై వాహనాదారులకు పశువుల వల్ల ప్రమాదాలు జరిగిన ఘటనలు కోకోల్లాలుగా ఉన్నాయి. రహదారులపై సంచరిస్తున్న ఆవులను కట్టడి చేయడానికి మున్సిపల్‌ కమిషనర్‌ చిత్రామిశ్రా, నగర కార్పొరేషన్‌ అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారు. ఆవులు, గేదెలు ఇతర పశువులు రోడ్డు మీద తిరగకుండా చూసుకోవాలని యజమానులకు తెలియజేశారు. ఒక వేళ రోడ్డు మీద తిరిగితే ఫైన్‌ వేయడం ఉండదని, నేరుగా ఆడవులకు, దూర ప్రాంతాల్లో ఉన్న గోశాలకు పశువులను తరలిస్తామని ప్రకటన విడుదల చేశారు. ఈక్రమంలో రోడ్డుపై తిరుగుతున్న ఆవులను నేరుగా డీఆర్‌సీ సెంటర్‌కు తరలిస్తున్నారు. ఇప్పటికే సుమారు 60వరకు ఆవులను డీఆర్‌సీలోకి తరలించిన్నట్లు మున్సిపల్‌ అధికారులకు చెబుతున్నారు. ఇందులో 20 నుంచి 30 ఆవులను అడవుల్లో వదిలిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం 30వరకు ఆవులు డీఆర్‌సీ సెంటర్లో ఉన్నాయన్నారు.



కారులో ఆవును తరలిస్తున్న దృశ్యం (ఫైల్‌)

బందోబస్తు ఏర్పాటు చేయాలి

పగలు, రాత్రి అని తేడా లేకుండా కొంతమంది ఆవులను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆవులకు మత్తు ఇంజక్షన్‌లు ఇచ్చి మరీ కారు, ఇతర వాహనాల్లో తరలిస్తున్నారు. డీఆర్‌సీ సెంటర్లలో ఆవులు ఉన్నా విషయం తెలుసుకొన్న పలువురు యువకులు, మున్సిపల్‌ సిబ్బందిపై దాడి చేసి, తీసుకెళ్లడానికి యత్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గట్టి బందో బస్తు ఏర్పాటు చేసి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
– ధాత్రిక రమేష్‌, హిందూ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్‌

సిబ్బందిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

డీఆర్‌సీ సెంటర్లలో ఆవులు ఉన్నాయన్న విషయం తెలుసుకున్న కొంతమంది యువకులు సెంటర్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. గేటు వద్ద ఉన్న మున్సిపల్‌ సిబ్బందిపై దాడి చేసి, ఆవులను తీసుకెళ్లడానికి యత్నించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, ఆవులను బయటకు వెళ్లకుండా చేసి, యువకులను అడ్డుకున్నారు. అనంతరం సదరు యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రావడంతో యువకులు పరారయ్యారని సిబ్బంది తెలిపారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ అవుతోంది.

2న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్‌ క్విజ్‌ పోటీలు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హుందాన్‌, ముప్పగంగారెడ్డి

- జిల్లా యువత దరఖాస్తు చేసుకోవాలి
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి

ఖలీల్‌వాడి: కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో జూన్‌ 2న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్‌ క్విజ్‌ పోటీలు నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని 16 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌ యూత్‌ డిక్లరేషన్‌ స్ఫూర్తిగా, తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్‌ 2న తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆన్‌లైన్‌ క్విజ్‌ కాంపిటీషన్‌ ఉంటుందన్నారు. ఈ క్విజ్‌లో 60 ప్రశ్నలు 60 నిమిషాలలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 16 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7661899899 నెంబర్‌కు మిస్డ్‌కాల్‌ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్‌ కోసం వెబ్‌లింక్‌తో కూడిన ఎస్‌ఎంఎస్‌ వస్తుందన్నారు. ఆ లింకు ద్వారా వారి వివరాలను అందులో జూన్‌ 1లోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రథమ బహుమతి కింద ల్యాప్‌టాప్‌, ద్వితీయ బహుమతి కింద స్మార్ట్‌ఫోన్‌, తృతీయ బహుమతి కింద ట్యాబ్‌తోపాటు నియోజకవర్గంకు 40 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ ప్రోత్సాహక బహుమతుల్లో 10స్మార్ట్‌ వాచ్‌లు, 10 ఇయర్‌పాడ్లు, 10 హార్డ్‌ డ్రైవ్‌లు, 10 పవర్‌బ్యాంకులు బహుకరిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతి కింద ఎలక్ట్రిక్‌ స్కూటర్లను సోనియా గాంధీ అందజేస్తారన్నారు. క్విజ్‌లో జనరల్‌ నాలెడ్జ్‌, తెలంగాణ ఉద్యమంతోపాటు తెలంగాణ సామాజిక అంశాలపై ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 8142903456, 8142803456ను సంప్రదించాలన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్‌ భవన్‌లో హెల్ప్‌ డెస్క్‌ ఉంటుందన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌ హుందాన్‌, జిల్లా కిసాన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, జిల్లా యూత్‌కాంగ్రెస్‌ అధ్యక్షుడు విక్కీయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

సిరికొండ: మండల కేంద్రంలోని మద్యం దుకాణాల్లో ఎక్సైజ్‌ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించడంతో దుకాణాల్లో మద్యం తగ్గించిన ధరకు విక్రయిస్తున్నారా లేదా అని వారు పరిశీలించారు. స్టాకు వివరాలను, రిజిస్టర్లను తనిఖీ చేశారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్‌ శాఖ అధికారులు

బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

పిట్లం: మండలం కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్‌ శివేంద్ర ప్రతాప్‌ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు పౌష్టికాహారం తీసుకునే విషయమై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కేంద్రానికి వచ్చే పిల్లల సంఖ్య తగ్గకుండా చూడాలన్నారు. అనంతరం పిట్లంలో కొనసాగుతున్న సీఎం కప్‌ క్రీడా పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్‌ శివేంద్ర ప్రతాప్‌

ఆశ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభం

బాన్సువాడ/బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ మాత శిశు సంరక్షణ ఆస్పత్రిలో మంగళవారం ఆశ కార్యకర్తలకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంను జిల్లా ప్రోగ్రాం అధికారిణి శోభారాణి ప్రారంభించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ.. నవజాత శిశువు సంరక్షణ, గృహ సందర్శనలో ఆశ కార్యకర్తల విధులు కీలకమని అన్నారు. ఇంటింటికీ తిరుగుతూ గర్భిణుల వివరాలు నమోదు చేయడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఐదు రోజుల శిక్షణకు తప్పక హాజరు కావాలని సూచించారు. టీవోటీ అన్వరీబేగం, రేణుక, సుశీల తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శోభారాణి

మద్యం తాగి ఆటోలు నడపొద్దు

ఆర్మూర్‌టౌన్‌: ఆటో డ్రైవర్లు మద్యం తాగి వాహనం నడపకూడదని ఎస్‌హెచ్‌వో సురేష్‌ బాబు అన్నారు. ఆర్మూర్‌లోని బస్టాండ్‌ ఆవరణలో మంగళవారం ఆయన ఆటో డ్రైవర్లకు 'మై ఆటో ఇస్‌ సేఫ్‌' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలకు క్యూఆర్‌ కోడ్‌ కచ్చితంగా అతికించి ఉండాలని, రాంగ్‌ రూట్లో, అతివేగంగా, సెల్‌ ఫోన్‌ మాట్లాడుతూ నడపరాదని అన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. అత్యావసర సమయంలో డయల్‌ 100ను ఉపయోగించాలని తెలిపారు. పోలీస్‌ కళా బృందం, పోలీస్‌ సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఉన్నారు.



ఆర్మూర్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు

నందనవనం.. నందిపేట్‌ పోలీస్‌స్టేషన్‌



నందిపేట పోలీస్‌ స్టేషన్‌ ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మొక్కలు



స్టేషన్‌ ఆవరణలో ఆహ్లాదాన్ని పంచుతున్న మొక్కలు

- ఠాణా ఆవరణలో పరుచుకున్న పచ్చదనం
- మొక్కల పెంపకంపై ఠాణా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ

నందిపేట్‌(ఆర్మూర్‌): మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో మొక్కల పెంపకంతో పచ్చని తోరణంలా నిలుస్తోంది. నందిపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్టేషన్‌ ఆవరణలో వివిధ రకాల మొక్కలు, నీడనిచ్చే చెట్లు, వివిధ రకాల పూలమొక్కలు దర్శనమిస్తాయి. మొక్కలు ఏపుగా పెరగడంతో అక్కడ ఎండ వేడిమి అనేది కనిపించదు. స్టేషన్‌ ముందు భాగంలో అన్ని కాలాల్లో పచ్చగా ఉండే తీగెపాదల మొక్కలను నాటి వాటిని అందంగా తీర్చిదిద్దారు. అలాగే పెద్దపెద్ద చెట్లతో పాటు టేకు మొక్కలు ఏపుగా పెరిగాయి. లోపలి భాగంలో జామ, మామిడి, నారింజ పండ్ల మొక్కలు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో చెట్టుకింద గుడిసెను వేసి గద్దెను నిర్మించారు. వివిధ పనులకు వచ్చే వారు ఇక్కడ కూరోచని సేద తీరుతుంటారు.

నీటి సరఫరా కోసం బోరు..

పోలీస్‌ స్టేషన్‌లో పచ్చదనం పెంచేందుకు సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారు. స్టేషన్‌ వెనుకభాగంతో పాటు పక్కన నిర్మించిన క్వార్టర్స్‌ భవనం వద్ద సైతం మొక్కలను నాటారు. రాత్రి వేళల్లో ఎక్కువగా గాలి వీచేందుకు వేప మొక్కలను నాటారు. అలాగే ప్రధాన రహదారి నుంచి ఠాణా వరకు రోడ్డు కిరువైపులా చెట్లను పెంచుతున్నారు. వందల రకాల మొక్కలు, చెట్లకు నీరందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బందితో పాటు ఇతర కూలీలు మొక్కలకు నీటిని పెడుతూ అవి ఏపుగా పెరిగేందుకు శ్రమిస్తున్నారు. ప్రత్యేకంగా బోరును ఏర్పాటు చేసుకుని పైపులైన్‌ ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

పర్యావరణ రక్షణకు తోడ్పాటు..




నందిపేట పోలీస్‌స్టేషన్‌ను మరింత ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అటవీశాఖ, ఈజీఎస్‌ నర్సరీలో కొత్తగా ఏ మొక్కలు కనిపించినా వాటిని తీసుకువచ్చి ఇక్కడ నాటుతున్నాం. తరచూ స్వచ్ఛ భారత్‌ను నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందిస్తాం. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన హరితహారం కార్యక్రమంలో భాగస్వాములం అవుతాం.
–శ్రీకాంత్‌, ఎస్సై, నందిపేట

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ రూరల్‌ మండలం గూపన్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మంగళవారం రూరల్‌ ఎస్సై లింబాద్రి తెలిపారు. గ్రామ శివారులో చెత్త ఏరుకునే ఓ వ్యక్తి (44) చెట్టు కింద పడుకొని అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సూర్యాస్తమయం.. ఇంటికి ఎలమందల పయనం



జీవాల పెంపకందారులు ప్రతినిత్యం వాటిని మేత కోసం అడవిలోకి తీసుకెళ్తుంటారు. ఎలమందలు పొద్దంతా మేత మేయగా.. వాటిని సూర్యాస్తమయానికి ఇంటికి చేర్చుతుంటారు. మంగళవారం ఓ కాపరి తన ఎలమందలను ఉదయం మేత కోసం అడవికి తీసుకెళ్లగా.. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఎలమందలు, వాటి కాపారి తిరిగి ఇంటిబాట పట్టారు. ఈక్రమంలో చెరువులో పరుచుకున్న తెల్లటి పువ్వులు, ఎలమందల ఇంటి పయనం, సూర్యాస్తమయం చూపరులను ఆకట్టుకుంది. ఈ దృశ్యం అర్సపల్లి చెరువు వద్ద సాక్షి కెమెరాకు చిక్కింది. –సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌–నిజామాబాద్‌

క్రైం కార్నర్‌

బైక్‌ అదుపు తప్పి యువకుడి మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని బూర్గుల్‌ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, బైక్‌ అదుపుతప్పడంతో కిందపడి మృతిచెందాడు. ఎస్సై సుధాకర్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన యువకుడు మద్దెల సాయి కుమార్‌(23) మంగళవారం తన స్నేహితుడు పాండురంగ రెడ్డితో కలిసి తిప్పారం నుంచి గాంధారి వైపు బయలుదేరాడు. బూర్గుల్‌ ఎక్స్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో సాయికుమార్‌ తలకు బలమైన గాయాలు అయ్యాయి. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మరో యువకుడికి గాయాలు కాగా మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సయ్యద్‌ మగ్దూం(26)కు రెండేళ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన రిజ్వానా బేగంతో వివాహం జరిగింది. వారికి ఆరు నెలల వయసున్న కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు పెద్దల సమక్షంలో వారికి నచ్చజెప్పగా భార్య అత్తవారింటికి వచ్చింది. ఈనెల 13న మళ్లీ దంపతుల మధ్య గొడవ కావడంతో మళ్ళీ భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన మగ్దూం మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నాజీర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

నిబంధనలు పాటించని వ్యాపారులకు జరిమానా

కామారెడ్డి క్రైం: ఆహార భద్రత నిబంధనలు పాటించిన పలువురు వ్యాపారులకు అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ జరిమానా విధించారు. జిల్లాలోని హోటళ్లు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలపై ఇటీవల ఆహార భద్రతశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆహార పదార్థాల కల్తీ, నాణ్యత లేని పదార్థల విక్రయాలకు పాల్పడుతున్న పలు కేంద్రాలపై కేసులు నమోదు చేశారు. ఈక్రమంలో ఆహార భద్రత శాఖ నమోదు చేసిన ఆరు కేసులపై రెవెన్యూ అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ మంగళవారం తన ఛాంబర్‌లో విచారణ జరిపారు. ఆయా కేసుల్లో ఆహార పదార్థాల విక్రయ వ్యాపారులకు రూ.లక్ష జరిమానాను విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార కల్తీకి పాల్పడితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. వ్యాపారులు కల్తీ లేని, నాణ్యత కలిగిన ఆహార పదార్థాలు విక్రయించాలని సూచించారు. లైసెన్సు లేకుండా ఆహార పదార్థాలు విక్రయిస్తే జరిమానా విధిస్తామని జిల్లా ఆహార భద్రత అధికారిణి సునీత పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



గాయపడ్డ దేవిసింగ్‌

పిట్లం(జుక్కల్‌): మండలంలోని చిన్నకొడప్‌గల్‌ గ్రామ శివారులో జాతీయ రహదారిపై మంగళవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరికి గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కంగ్టి మండలంలోని జంగి తండాకు చెందిన దేవిపింగ్‌ బైక్‌పై పిట్లం వస్తుండగా.. చిన్నకొడప్‌గల్‌ గ్రామ శివారులో జాతీయ రహదారిపై వెనక నుంచి వచ్చిన బైక్‌ ప్రమాదవశాత్తు దేవిసింగ్‌ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దేవిసింగ్‌కు గాయాలు అయ్యాయి. స్థానికులు అడడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ నడుపుతుండగా ఫిట్స్‌ రావడంతో..

పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారిపై బైక్‌ నడుతున్న ఓ వ్యక్తికి ఫిట్స్‌ రావడంతో బైక్‌పై ఉన్న నలుగురు కిందపడి, గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బిచ్కుంద మండలంలోని పుల్కల్‌ గ్రామానికి చెందిన సంజీవ్‌ తన భార్య పిల్లలతో కలిసి బైక్‌పై పిట్లం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. పిట్లం శివారులో సంజీవ్‌కు ఫిట్స్‌ రావడంతో బైక్‌ అదపు తప్పి ముందు ఉన్న బైక్‌ను ఢీకొని కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో సంజీవ్‌, అతని భార్య అమృతకు తీవ్ర గాయాలు కాగ, వారి పిల్లలు అదివ్రత్‌, అద్వితలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో గాయపడ్డ చిన్నారులు